క్లుప్తంగా

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: గుండె జబ్బులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని నందులపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డేను నిర్వహిస్తారని తెలిపారు. క్యాన్సర్ కన్నా ఎక్కువ మరణాలు గుండె జబ్బుల వలన జరుగుతున్నాయన్నారు. ప్రజల్లో అవగాహన లేకపోవడం వలన ఎక్కువ మంది దీని బారినా పడి మరణిస్తున్నట్లు చెప్పారు. పొగ తాగడం మానేసి, కొలస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలన్నారు. రక్తపోటును అదుపులో ఉంచుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.

ప్రేమ్‌కుమార్‌కు గుర్రం జాషువా సేవా రత్న అవార్డు



తెనాలిఅర్బన్: చందోలు దేవాదాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదరావూరుకు చెందిన ఈపూరి ప్రేమ్‌కుమార్‌కు గుర్రం జాషువా సేవా రత్న అవార్డును ప్రదానం చేశారు. రేపల్లెలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు గుంటూరు రెడ్డయ్య, జూలకంటి బుజ్జి, చిలకా సుధాకర్‌లు పాల్గొనట్లు ప్రేమ్‌కుమార్ తెలిపారు.

పవర్‌లిఫ్టర్‌కు ఎల్సిసీ బెంచ్ షర్ట్ బహూకరణ



తెనాలి: పట్టణానికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షబీనాకు పోటీలకు అవసరమైన ఎల్సిసి బెంచ్ షర్టును రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం సోమవారం బహూకరించింది. ఎల్సిసీ బెంచ్ షర్ట్‌కు రూ.22 వేలను క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ వ్యయం చేశారు. పూర్ణచంద్ మాట్లాడుతూ అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షబీనాకు గతంలో కూడా అవసరం వచ్చినప్పుడు ఆర్థిక సహాయం అందించినట్లు గుర్తుచేశారు. రోటరీ క్లబ్ బాధ్యులకు పవర్ లిఫ్టర్ షబీనా ధన్యవాదాలు తెలియజేశారు. రోటరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ గుమ్మడి వెంకట్‌నారాయణ, కోశాధికారి వెంపటి హరి ప్రసాద్, గుత్తా వెంకటరత్నం, పావులూరి రాంబాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రంగస్థల కృషీవలుడు కన్నెగంటి రాధ



తెనాలి: జీవితమంతా నాటకకళకు అంకితం చేసిన గొప్ప కళాసేవకుడు కన్నెగంటి రాధ అని సుప్రసిద్ధ హార్మోనిస్టు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కర్నూలు జిల్లా నాయకులు వెంకట రామవర్మ అన్నారు. పట్టణానికి చెందిన రంగస్థల కళాకారుడు కన్నెగంటి రాధ వర్ధంతిని సోమవారం స్థానిక 'ఇస్కఫ్' హాలులో జరిపారు. ప్రజానాట్యమండలి, సత్యం శివం సుందరం సామాజిక సేవాకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు బెజ్జంకి నాగమణి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లోనూ చీకటి తెరలు నాటిక, భయం నాటకం ప్రదర్శించిన ఘనత రాధాదే అన్నారు. కళలకు ఆదరణ లేని రోజుల్లోనే కళల కోసం, కళాకారుల సంక్షేమం కోసం పరితపించిన వ్యక్తి కన్నెగంటి రాధా అని, ఆయన స్ఫూర్తితో నాటక కళాకారులు ముందుకు సాగాలన్నారు. అధ్యక్షత వహించిన నాగమణి మాట్లాడుతూ కన్నెగంటి రాధ నాటక ప్రదర్శనలు చిన్నతనంలోనే చూసి ఆయన అభిమానిని అయ్యానని అన్నారు. తెనాలి పట్టణంలో వందల సంఖ్యలో కళాకారులను, దర్శకులను తయారు చేసిన ఘనత కన్నెగంటి నాసరయ్య, రాధకు దక్కుతుందని అన్నారు. బొల్లిముంత కృష్ణ, తన్నీరు శివశంకర్ పర్యవేక్షించగా కన్నెగంటి గోపీచంద్, మధు, మణికుమార్, పాతూరి సుబ్రహ్మణ్యం, కొప్పరాజు విజయసారథి, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, కమ్మెల రజిని, వినుకొండ శ్రీరామమూర్తి, కన్నెగంటి సుజాత, కన్నెగంటి మౌనిక, శ్రీదేవి, చందు అనూరాధ తదితరులు పాల్గొన్నారు. ముందుగా రాధా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

దుప్పట్లు పంపిణీ

తెనాలిరూరల్: మండలంలోని నందివెలుగు గ్రామంలో కాల్వ కట్టల వెంబడి నివసిస్తున్న నిరాశ్రయులైన పేదలకు సినీ దర్శకుడు దిలీప్ రాజా సోమవారం దుప్పట్లు, చాపలను పంపిణీ చేశారు. వర్షాలకు నిరాశ్రయులైన నిరుపేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇటువంటి వారిని ప్రభుత్వం గుర్తించి శాశ్వత గృహాలను నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆయన వెంట రావూరి సురేష్‌బాబు, అంజలి ఉన్నారు.

కార్యకర్తలకు కొండంత అండ

- డిజిటల్ బుక్‌లో కూటమి అన్యాయాలను రికార్డు చేయండి
- క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ 2.0 ప్రతి కార్యకర్తకు కొండంత అండగా నిలుస్తుందని పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ పరిశీలకుడు గులం రసూల్, నేతలతో కలిసి శివకుమార్ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ బ్రోచర్‌లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమ పాలనలో, మేనిఫెస్టో అమలులో దేశంలోనే నెంబర్‌వన్ అనిపించుకున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తాజాగా డిజిటల్ బుక్ 2.0 ప్రవేశపెట్టటం చారిత్రాత్మకమని చెప్పారు. అన్యాయానికి గురవుతున్న పార్టీ కార్యకర్తలు, నాయకులకు పూర్తిభరోసానిచ్చేందుకే తీసుకొచ్చినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, తొలి ఆరునెలల్లో జరిగిన విధ్వంసం, దాడులు దేశచరిత్రలో మునుపెన్నడూ లేవని గుర్తుచేశారు.

- తెనాలిలో కాళిదాసు సత్యంపై హత్యాయత్నం, సోషల్‌మీడియా యాక్టివిస్టు నీలి అజయ్ ఇంటిపై విధ్వంసం ఘటనలను వీడియోలు చూపించారు. తాను ఎమ్మెల్యేగా వేసిన శిలాఫలకాలు, ప్రారంభోత్సవ ఫలకాలను ధ్వంసం చేశారని చెప్పారు. దాడులపై పోలీసులను ఆశ్రయించినా కేసులు తీసుకోలేదని గుర్తుచేశారు. పైగా బాధితుడినే పోలీసులు పిలిపిస్తున్నారని చెప్పారు. ఎప్పుడో ఎవరో ఏదో అన్నారని, మనోభావాలు దెబ్బతిన్నాయంటూ కేసులు పెట్టిన వివరాలను వెల్లడించారు. వీటన్నిటి నుంచి పార్టీ కార్యకర్తలను, సానుభూతిపరులకు కాపాడుకునేందుకు డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చినట్టు చెప్పారు. వీటిన్నిటినీ డిజిటల్ బుక్‌లో నమోదుచేసి, చట్టప్రకారం తగిన శిక్షలు పడేలా చూడటం ఖాయమన్నారు.
- పరిశీలకుడు గులాం రసూల్ మాట్లాడుతూ అన్యాయాలను ప్రశ్నించడానికి, బాధ్యులైన అధికారులు, కూటమి నేతలు ఎవరినీ వదిలిపెట్టేది లేదనీ, చట్టం ముందు నిలబెట్టేందుకే డిజిటల్ బుక్ వచ్చిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా చేసిన అనుచిత వ్యాఖ్యలపై బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ కొల్లిపర మండల అధ్యక్షుడు కళ్లం వెంకటప్పారెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుర్రా జశ్వంత్‌యాదవ్, లీగల్‌సెల్ అధ్యక్షుడు మైలా విజయ్‌నాయుడు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కొంగర రాగమంజరి, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్లె రోహిత్ శామ్యూల్ మాట్లాడారు. జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి సహా పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన అభివృద్ధి

- ఇన్‌చార్జి కమిషనర్‌పై ఆరోపణలు చేసిన కౌన్సిలర్‌లు
- వాడీవేడిగా తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక



సమస్యలు తెలియజేస్తున్న కౌన్సిలర్‌లు రామయ్య, ఇస్మాయేల్, అరుణ

తెనాలిఅర్బన్: కాంట్రాక్టర్‌ల బిల్లుల చెల్లింపులలో జాప్యం వల్ల తెనాలి పట్టణంలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని, టెండర్లు పిలిచి ఏళ్లు గడుస్తున్నా ఒక్క పని కూడా కాంట్రాక్టర్‌లు ప్రారంభించటంలేదని, దీనికి ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తుందంటూ పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్‌లు ఆరోపించారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. ఏడో అంశం చదవటం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్‌లు దేసు ముగంధర్, పసుపులేటి త్రిమూర్తిలు లేచి మున్సిపల్ కార్యాలయం వెనుక అసంపూర్తిగా ఉన్న స్వర్ణ కారుల భవనాన్ని పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్సీ ఆదేశించి వారం దాటుతున్న ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కనీసం దాని ఆవరణలోని మురుగు నీరును కూడ తొలగించలేదని ఆరోపించారు. దసరా అనంతరం కౌన్సిలర్‌ల సమక్షంలో కాంట్రాక్టర్‌లతో సమావేశం నిర్వహిస్తే ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుస్తాయని, ఆదిశగా అడుగులు వేయాలని కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య సూచించారు. దీనికి చైర్‌పర్సన్ రాధిక అంగీకరం తెలిపి వెంటనే సమావేశం నిర్వహించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

సమస్యలపై ఏకరువు..

తన వార్డులో సిల్ట్ తీయటం లేదని కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ బేగ్, చినరావూరు కమ్యూనిటీ హాల్‌లో వ్యర్థాలు తొలగించాలని, దాని పనులు పూర్తి చేయాలని కౌన్సిలర్ కుర్రా సుజాత కోరారు. 27వ వార్డులో కాల్వకు సైడ్ వాల్స్ నిర్మించాలని కౌన్సిలర్ బోయపాటి అరుణ, కుక్కల సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ దాసరి వీరవసంత రావు, రోడ్లు, కాల్వలు, కల్వర్టులు నిర్మించాలని, మంచినీటి కుళాయి కనెక్షన్‌లు లేకపోయిన బిల్లులు వేస్తున్నారని, వాటిని రద్దు చేయాలని కౌన్సిలర్‌లు షేక్ ఇస్మాయేల్, కొమరబత్తిని జయపాల్, గోగిరెడ్డి మానసరెడ్డి, ఆవుల కోటయ్య, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, తాడిబోయిన బ్రహేశ్వరరావులు కోరారు. కంపోస్ట్ యార్డులో వ్యర్థాలు ఎప్పటికి పూర్తిగా తొలగిస్తారంటూ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ప్రశ్నించారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు.



సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన వాసవి అమ్మవారు




దేవీచౌక్‌లో శ్రీసరస్వతీదేవిగా..



మారీసుపేటలో శ్రీసరస్వతీదేవి అలంకారం



కొత్తపేటలోని అష్టలక్ష్మీ ఆలయంలో ..



పాత శివాలయంలో శ్రీసరస్వతీదేవిగా..

సరస్వతీ నమస్తుభ్యం..!

దసరా పర్వదినం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో శ్రీదేవీ శరన్నరాత్రి మహోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజైన సోమవారం ఆలయాల్లో అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. - తెనాలి/- తెనాలిటౌన్/- కొల్లిపర



నందివెలుగులో శ్రీ సరస్వతీ దేవిగా దుర్గాదేవి..



కఠెవరంలో శ్రీ సరస్వతీ దేవిగా..



కొల్లిపర జనార్ధన స్వామి ఆలయంలో సరస్వతికి పూజలు చేసి, చిన్నారులకు పుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ పద్మావతి



తెనాలి సువర్చలసమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

వృద్ధురాలిని చూసి చలించిన సబ్ కలెక్టర్

- నేలపై కూర్చొని సమస్యను ఆలకించిన అధికారి
- ఊరడించి న్యాయం చేస్తామని హామీ



కింద కూర్చొని వృద్ధురాలి కష్టం తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయం. ఉదయం 11 గంటల ప్రాంతం. ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరుగుతోంది. అధికారులతో కలిసి సబ్‌కలెక్టర్ ప్రజలనుంచి అర్జీలను తీసుకుంటున్నారు. వచ్చీపోయేవారితో కార్యాలయ ఆవరణ రద్దీగా ఉంది. ఆ సమయంలో ఓ వృద్ధురాలు నడవలేక నడుస్తూ వచ్చి, సమావేశపు హాలు వాకిట్లోనే కూర్చుండిపోయింది. అది గమనించిన సబ్ కలెక్టర్ తానే కుర్చీలో నుంచి లేచి వృద్ధురాలి వద్దకు వచ్చారు. ఆమె ఎదురుగా కింద కూర్చుని సమస్య మొత్తం ఆలకించారు.

- ఆ వృద్ధురాలి పేరు పోలవరపు అనంత లక్ష్మీకాంతమ్మ. చేబ్రోలు మండల గ్రామం శలపాడు. ముగ్గురు కుమార్తెలు. అందరికీ పెళ్లిళ్లు చేశారు. తనకు 50 సెంట్ల మాగాణి ఉంది. మతిస్థిమితం లేని చిన్నకుమార్తె పాలడుగు పద్మావతికి 60 సెంట్ల భూమి ఉంది. పద్మావతి కుమార్తె రాధికను పల్నాడు జిల్లా గుత్తికొండ ఇచ్చారు. వ్యసనపరుడైన భర్త రాధికను పుట్టింటికి కూడా పంపటం లేదు. ఆస్తి రాసిస్తేనే పంపుతానని భీష్మించుక్కూర్చున్నాడు. ఈ క్రమంలో గత నెల మనవరాలు రాధిక, ఆమె అత్తమామలు శలపాడు వచ్చారు. దస్తావేజులు, ఆధార్ కార్డులు తీసుకుని, 'ఆన్‌లైన్ కాలేదు...చేయిస్తాం' అంటూ తీసుకెళ్లారు. రైతుభరోసా వస్తుందని నమ్మబలికారు. మళ్లీ ఈనెల 16న వచ్చి కారులో ఎక్కించుకుని పగలంతా రిజిస్ట్రారు కార్యాలయంలో ఉంచారు. రాత్రిపూట ఒక దాబా దగ్గర అట్టిపెట్టారు. చిన్నకుమార్తె పద్మావతి, లక్ష్మీకాంతమ్మ వేలిముద్రలు, సంతకాలు తీసుకున్నారు. తర్వాత ఇంటిదగ్గర వదిలేసి వెళ్లారు. తీరా చూస్తే తమ భూమిని రిజిస్టరు చేయించుకుని తమకు ఆస్తి లేకుండా చేశారంటూ లక్ష్మీకాంతమ్మ పూసగుచ్చారు. శ్రద్ధగా విన్న సబ్ కలెక్టర్ పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఆమెకు భోజనం పెట్టి పంపమని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి



బొమ్మువానిపాలెంలో వరద ఉధృతిపై రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

లంక గ్రామాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

బొమ్మువానిపాలెం(కొల్లిపర): కృష్ణా నదికి వరద ఉధృతి పెరగడంతో సోమవారం మండల పరిధిలోనే కొల్లిపర, బొమ్మువానిపాలెం, లంక గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పర్యటించి, వరదల కారణంగా నీట మునిగిన పంటలను పార్టీ నాయకులతో, రైతులతో కలసి పరిశీలించారు. వరదలు కారణంగా ఏఏ పంటలకు ముప్పు ఉంది, ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుంది, వరదలు కారణంగా గ్రామంలో అంటువ్యాధులు ఏమైన ప్రభలుతున్నాయా, పారిశుద్ధ్య పనులు అధికారులు ఏలా చేస్తున్నారు. అన్న అంశాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో వరదలు వచ్చినప్పుడు పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు అతి తక్కువ కాలంలో ఎటువంటి పార్టీ బేధం చూపకుండా నష్టం జరిగిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం నేరుగా వారి ఖాతాలో జమ చేయటం జరిగిందని గుర్తుచేశారు. పసుపు పంటకు ఎక్కువ శాతం నష్ట పరిహారం చెల్లించటం జరిగిందన్నారు. ఇప్పటి ప్రభుత్వం కూడా వరదలు తగ్గిన వెంటనే అధికారులు చేత నష్టం అంచానాను పరిశీలించి నష్టం జరిగిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా ఎప్పుడు రైతుల వెంట ఉంటుందని భరోసా అందించారు. బొమ్ము శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి, ఆరిగ అశోక్‌రెడ్డి, వంగా సుధాకరరెడ్డి, పిల్లి గంగాధర్, బాజీ, చంటి, రైతులు పాల్గొన్నారు.

నేడు 'డాక్ అదాలత్'

తెనాలి: విజయవాడలోని రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఉత్తర్వుల ప్రకారం మంగళవారం స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి సోమవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. పోస్టల్ సేవలను పొందటంలో ప్రజలనుంచి ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే, వారు మంగళవారం ఉదయం 11 గంటలకు నేరుగా పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఫిర్యాదుచేయాలని కోరారు.

వాట్సాప్ గ్రూపుల నుంచి లెఫ్ట్

నల్ల బ్యాడ్జీలు ధరించి పింఛన్లు పంపిణీ చేయనున్న సచివాలయ ఉద్యోగులు

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెనాలి పట్టణ పరిధిలో ఉన్న సచివాలయ ఉద్యోగులు సోమవారం మున్సిపల్ వాట్సాప్ గ్రూపుల నుంచి లెఫ్ట్ అయ్యారు. మంగళవారం పింఛన్ డబ్బులు బ్యాంకుల నుంచి డ్రా చేసి 1వ తేదీన నల్లబ్యాడ్జీలతో వాటిని పంపిణీ చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

పోలీసుల 'పల్లె నిద్ర'

తెనాలిరూరల్: తెనాలి టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక కబేళా వంతెన వద్ద పల్లె నిద్ర కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. సీఐ ఎస్.రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశ రావు స్థానికులతో మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారమందించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

విశ్వ నరుడు గుర్రం జాషువా



జుజ్జవరపు న్యూటన్‌కు జాషువా పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: దుర్భర కులకాలుష్యం శాసిస్తున్న కాలంలో తన కలంతో దునుమాడి, సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు తన జీవితాన్నే ధారబోసిన మహాకవి గుర్రం జాషువా ధన్యజీవి అని ఆదివారం రాత్రి జరిగిన గుర్రం జాషువా జయంతి సభలో వక్తలు అన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు సమితి కార్యదర్శి పినపాటి రవికుమార్ అధ్యక్షత వహించారు. సాహిత్య విశ్లేషకుడు బీరం సుందరరావు తన ప్రసంగంలో కవి ఎప్పుడూ కులమతాలకు అతీతుడంటూ, తనను తాను విశ్వ నరుడు అని జాషువా ప్రకటించుకున్నట్టు గుర్తుచేశారు. నిజజీవితంలో స్వయంగా అనుభవించిన బాధలు, కష్టాలనే సామాన్యులకు కూడా అర్థమయ్యే రూపంలో పద్యాల రూపంలో అందించారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో నేటితరం కులమతాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. సభలో గుర్రం జాషువా సాహిత్య ప్రచారానికి విశేషంగా కృషిచేసిన విజ్ఞానసమితి అధ్యక్షుడు జుజ్జవరపు న్యూటన్‌కు జాషువా పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. సుద్దపల్లి మురళీధర్ స్వాగతం పలికిన సభలో రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విశ్రాంత డీఐజీ శావలి బాలస్వామి, పల్నాడు జిల్లా డీపీఎం కారుమూరి అమలకుమారి, టీవీ, రేడియో ఆర్టిస్ట్ జెల్లి గంటయ్య, న్యాయవాది ఇందుపల్లి రాజారామ్, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుద్దపల్లి సుకుమార్, కళాకారుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, లంకా ప్రసాద్ మాట్లాడారు. కొండముది రమేష్ బాబు, వేజండ్ల రత్నం, పేరిపోగు రాజగోపాల్, సీహెచ్ భాస్కరరావు, కనపాల రాజేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేతుల మీదుగా కవితా పురస్కారం స్వీకరించిన తెనాలికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి. వేదికపై రసరాజు, అనంతశ్రీరామ్ ఉన్నారు. - తెనాలి

జనరంజకంగా పద్య నాటకాలు



పుత్రాదిచ్ఛేత్ పద్యనాటకంలో ఓ సన్నివేశం

తెనాలి: విజయనగర రాజు శ్రీకృష్ణదేవరాయలు కాలంలో అధికార వ్యామోహంతో రాజద్రోహానికి తలపడిన తండ్రి నాగమనాయకుడిని యుద్ధంలో ఓడించి తగిన బుద్ధిచెప్పిన దేశభక్తుడైన విశ్వనాథుడు ఇతివృత్తంగా శ్రీకళాప్రకాశం, ఒంగోలు వారు ప్రదర్శించిన 'పుత్రాదిచ్ఛేత్' పద్యనాటకం ప్రేక్షకుల ప్రశంసలను అందుకుంది. శారదా ప్రసన్న రచనకు సీవీ శివప్రసాద్ దర్శకత్వం వహించారు. కళల కాణాచి, తెనాలి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో జరుగుతున్న వీణా అవార్డ్స్-2025 నాటకోత్సవాల్లో సోమవారం రెండు పద్యనాటకాలు, సాంఘిక నాటకం, సాంఘిక నాటికను ప్రదర్శించారు. అన్ని ప్రదర్శనలు ఒకటికి మించి మరొకటి అన్నట్టుగా సాగాయి. రెండో ప్రదర్శనగా కుమారరామ భీమేశ్వర నాట్యమండలి, కాకినాడ వారి 'అయోధ్య రామయ్య' పద్యనాటకం ప్రశంసలనందుకుంది. డాక్టర్ జంధ్యాల సుబ్బలక్ష్మి రచనను ఎస్‌కే అమీర్ దర్శకత్వంలో ప్రదర్శించారు. తదుపరి దృశ్యవేదిక సాంస్కృతిక సంస్థ, విజయవాడ వారి 'ఇది ప్రమాదానికి సంకేతం' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఆకురాతి భాస్కర చంద్ర రచనకు ఎస్‌కే మిశ్రో దర్శకత్వం వహించారు. చివరగా రఘురామ కళామిత్రమండలి, బళ్లారి వారి 'నేటి కబంధ హస్తం' సాంఘిక నాటికను ప్రదర్శించారు. నేతి రఘురామ రచనను ఎన్.సూర్య దర్శకత్వంలో ప్రదర్శించారు.

- ప్రదర్శనల విరామంలో రాత్రి ఏడు గంటలకు ఏర్పాటైన సభకు కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అధ్యక్షత వహించారు. సహజకవి అయినాల మల్లేశ్వరరావుకు 'దశ సహస్రాధిక పద్య రచనా విపంచి' బిరుదును ప్రదానం చేసి సత్కరించారు. వివిధ రంగాల ప్రముఖులు పొన్నపల్లి గోపాలకృష్ణ, యడ్లపాటి రఘునాథబాబు, ఈదర వెంకట పూర్ణచంద్, మాగంటి రత్నాకరశాస్త్రి, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, వెంపటి సత్యనారాయణ పాల్గొన్నారు. అయినాల పద్యరచనా వైశిష్ట్యాన్ని ప్రశంసించారు. వీణా అవార్డ్స్ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి



తెనాలిరూరల్: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి సూచించారు. సంగంజాగర్లమూడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ శిబిరాలలో అన్నిరకాల వైద్యసేవలు అందించి మందులను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ గైనకాలజీ, పీడియాట్రిషన్, జనరల్‌ఫిజీషియన్, డెంటల్, సైకియాట్రి, కంటి వద్యం, ఆయుష్, క్షయ వ్యాధికి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తెనాలి టీబీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకుని మందులను ఉచితంగా పొందవచ్చని సూచించారు.